# డేర్ డెవిల్



మధుబాబు

# DARE DEVIL - 1

(Serialised in 'Navya' weekly)

By

**MADHUBAABU**

Published by:

**MADHU PRIYA PUBLICATIONS**

Machavaram, Vijayawada - 520 004

Phone : 94411 94605

E-mail : madhupriyapublications@gmail.com

First Edition :

**2016**

Price :

**Rs. 95-00**

Cover Design :

**DURGA RAO**

Printers :

**SRI CHAITANYA OFFSET PRINTERS**

Vijayawada-2

# డేర్ డెవిల్-1

అతి జాగ్రత్తగా ప్లాన్ చేశాడు విన్నూదాదా. ఎటువంటి పరిస్థితి లోను, పని పూర్తిగా జరిగి పోవాలని ఆర్డర్స్ కూడా ఇచ్చాడు.

పది మంది ఫాలోయర్స్ ఉన్నారు అతనికి. కనుసైగ చేస్తే చాలు, నిప్పుల్లో దూకి తమ ప్రాణాలు వదిలేయటానికైనా సిద్ధమని చాలా గట్టిగా చెప్పారు అతనికి.

“పొద్దున్నే లేవగానే చాయ్ ఇప్పిస్తున్నాను. మధ్యాహ్నం చికెన్ బిర్యానీ తినిపిస్తున్నాను. చీకటిపడే టైములో మస్తుగా మందు పోయిస్తున్నాను. ప్రాణాలే ఏంటి, ఇంకేది అడిగినా ఇచ్చేస్తామంటారు. ఆ మాటలు పట్టుకుంటే నరకానికే....” తనకు రైట్‌హేండ్ లాంటి నఫీజుతో అన్నాడు విన్నుదాదా.

"ఆ బద్మాష్‌గాళ్ళ మీద అంత నమ్మకం లేకపోతే ఎందుకు మరి ఈ పనికి పంపించటం? ఇంతోటి దానికి నువ్వు నేను సరిపోమా?" అని అడిగాడు నఫీజు – నిన్న సాయంత్రం.

"ఒరేయ్ నఫీజు గాడా... వళ్ళు దగ్గర బెట్టొని మాట్లాడు. ఆషామాషీ పనికాదు ఇది. అవతల ఉన్నది ఎవరని అనుకున్నావ్ బే?" కనులు చిట్లించి చూస్తూ అడిగాడు విన్నుదాదా.

"ఎవరైతే ఏందన్నా? ఆ సిటీ సెక్యూరిటీకి పార్టనరే కదా. ఒక డొక్కు అంబాసిడర్ కారేసుకుని పనీపాటా లేనట్టు రోడ్లట్టుకుని తిరిగే శ్యామ్‌సుందర్‌ని ఖతమ్ చేయటమే కదా...." చాలా తేలికగా అదేదో చాలా చిన్నపని అన్నట్లుగా అడిగాడు నఫీజు.

లాగిపెట్టి అతని చెంపమీద కొట్టాలన్నంత కోపం ఒక్కసారిగా ఎంటర్ అయింది విన్నుదాదా మనసులోకి.

తొందరపడలేదు అతను. అందుకు చాలా పెద్ద కారణమే ఉంది. అప్పటికి ఆరు నెలల క్రితం వరకూ కేరళ రాష్ట్రంలో ఉండి వచ్చాడు నఫీజు. ఉద్యోగం చేస్తూనో, ఊళ్ళు ఏలుతూనో కాదు... దారిన పోతున్న ఒక పెద్దావిడ మెడలో ఏడు తులాల బంగారు గొలుసు తెంపటానికి ట్రై చేసి మోటార్ బైక్ ముందుచక్రం పంక్చర్ అయిపోవటంతో, బొక్కబోర్లా కిందపడి అందరికీ దొరికిపోయాడు.

పట్టుకుని చితక బాదేశారు చుట్టుపక్కల ఉన్న జనం. కొన ఊపిరితో కొట్టుకుంటున్నప్పుడు తీసుకుపోయి పోలీసులకు అప్పగించారు.

నఫీజు దురదృష్టం అంతటితో ఎండ్ అయిపోలేదు. ఇంకోసారి బాగా నలుగుపెట్టి తలంటి స్నానం చేయించారు ఆ పోలీసులు. నడవటానికి కూడా ఓపిక లేక, తోటకూర మాదిరి వేలాడబడి పోతున్నప్పుడు తీసుకుపోయి జడ్జి ముందు నిలబెట్టారు.

మూడ్ బాగోలేదు జడ్జిగారికి ఆ రోజు. ఒకటే చికాకు... రుసరుస ఎదుటికి వచ్చిన వాళ్ళందర్నీ విదిలించి అవతలకి పంపించేస్తున్నాడు. బిక్కమొగంతో చేతులు కట్టుకుని నిలబడిన నఫీజుని చూడగానే, జాలి కలగాల్సింది పోయి, మరింతగా పాడయిపోయింది మూడు.

"పది సంవత్సరాలు వేయాలి నీకు జైలు శిక్ష–మళ్ళీ ఇటువంటి పనులు చేసేందుకు ఓపిక లేకుండా కాళ్ళు చేతులు చచ్చుబడిపోయేవరకూ లోపలే ఉంచాలి. చట్టం అందుకు వప్పుకోకపోవడం నీ అదృష్టం. రెండున్నర ఏళ్ళు మాత్రమే వడ్డిస్తున్నా– పండగ చేస్కో" అంటూ వెలువరించాడు తీర్పుని.

అప్పుడు కూడా అవతలికి తొలగిపోలేదు నఫీజుని కావిలించుకుని ఉన్న దురదృష్టదేవత. అతనితో పాటుగా జైలు ఆవరణలోకి వచ్చేసింది.

"నువ్వు ఈ స్టేటుకి చెందినవాడివి కాదు. ఇంకో చోటినుంచి వచ్చావు. మేము పనులు చేసుకునే ప్రదేశంలో మమ్మల్ని పక్కకు నెట్టి నువ్వు ఎంటర్ అవటం ఏమిటిబే? పరాయివాడివి పరాయి వాడిగానే ఉండకుండా మా వాళ్ళని నువ్వు దోచుకుంటావా? మేము చేతులు ముడుచుకుని చూస్తూ ఊరుకోవాలా?" అంటూ మూకుమ్మడిగా అతని మీద దాడికి దిగారు ఆల్‌రెడీ అక్కడ ఉన్న చైన్ స్నాచర్స్.

"అదే భాయి– పరాయివోడివి అనటం మంచిగాలేదు. మన మందరం ఇండియన్స్– మనది భారతదేశం– భారతీయులం– ఈ దేశంలో ఎవరైనా ఎక్కడి కయినా పోవచ్చు. ఏమయినా చేయవచ్చు." అంటూ వారందరికీ నచ్చ చెప్పే ప్రయత్నం చేశాడు అతను.

వినిపించుకోలేదు ఎవరూ... తుక్కుకింద కొట్టి, జైలు ఆవరణ మధ్యలో ఉన్న వాటర్ ఫౌంటెయిన్ దగ్గిర పడేశారు.

అదిగో అప్పుడు అతనిమీద జాలి కలిగినట్లుంది కాబోలు... అవతలికి వెళ్ళిపోయింది వదిలి పెట్టకుండా ఉంటున్న దురదృష్టదేవత.

తన ఆఫీసు రూమ్ కిటికీ దగ్గరికి వచ్చి అతన్ని గమనించాడు జైలు వార్డెన్. గార్డుల్ని ఎలర్ట్ చేసి ఫౌంటెయిన్ దగ్గరికి పంపించాడు.

"వీడు నిజంగా చాలా అదృష్టవంతుడు. మీరు తీసుకురావటం ఇంక రెండు నిమిషాలు ఆలస్యం అయివుంటే – ఆ ఫౌంటెయిన్ దగ్గిరే గుటుక్కుమని ఉండేవాడు" ఏదో ఇంజక్షన్‌ని అర్జంటుగా నఫీజు చేతికి చేస్తూ కామెంట్ చేశాడు జైలు డాక్టర్.

"నేను చేయగలిగింది ఇంతవరకే... తీసుకుపోయి పెద్దాసుపత్రిలో పడేయండి. పది పదిహేను రోజులు పడుతుంది కళ్ళువిప్పి చూడటానికి. అప్పటివరకూ పక్కన కూర్చుని సేవలు చేసే ఫెసిలిటీలు ఇక్కడ లేవు" అని కూడా చెప్పాడు.

అప్పటికప్పుడు ఒక అంబులెన్స్ పిలిచి, పెద్దాసుపత్రికి తరలించారు నఫీజుని. "లోపలికి వచ్చిన మొదటి అరగంటలోనే మళ్ళీ బయటికి వెళుతున్న మొదటి పోటుగాడివి నువ్వు... నిజంగా చాలాగ్రేట్...." అంబులెన్స్‌లో ఉండగానే నఫీజుతో అన్నాడు కాపలాగార్డు.

తెలివిలో లేడని, తను ఏం మాట్లాడినా అతనికి వినిపించే అవకాశం లేదని ఒకవేళ వినిపించినా, సమాధానం చెప్పే పరిస్థితి ఉండదని అనుకున్నాడు అతను.

అంతకు ముందు వరకూ విడవకుండా వెంటఉంటున్న నఫీజు దురదృష్టం అతన్ని వదిలిపెట్టి చాలా సేపయిందని తెలియకపోవడం వల్ల. ఎరైజ్ అయిన సిచ్యుయేషన్ అది.

అంబులెన్స్‌లో నుంచి స్ట్రెచర్ మీదికి చేర్చబడ్డాడు నఫీజు. ఎందుకూ పనికిరాని ఒక చైన్‌స్నాచర్‌ని పెద్ద ఇంపార్టెంట్ పర్సనాలిటీని తీసుకుపోయినట్లు మృదువుగా, మెత్తగా ఎటువంటి ఒత్తిడి తగలకుండా లోపలికి తీసుకుపోవడం నామోషీ అనిపించింది ఆ స్ట్రెచర్‌ని హేండిల్‌చేసే అటెండర్స్‌కి.

గబగబా అడుగులు వేయటంలో తడబడడ్డారు. తల్లక్రిందులైంది స్ట్రెచర్. దబ్‌మని శబ్దం చేస్తూ పడిపోయాడు నఫీజు... పడింది అతను ఒక్కడే కాదు... అటెండర్స్ కూడా బాలెన్స్ నిలుపుకోవడం చేతకాక అతనికి కొంచెం అవతలగా కింద చతికిలబడ్డారు.

జైలు డాక్టరుగారు అర్జంటుగా చేసిన ఇంజక్షన్ పని చేసిందో, లేక, క్రిందపడేసరికి దిమ్మతిరిగి బ్రెయిన్ క్లియర్ అయిందో తెలియదు గాని, తెలివి వచ్చేసింది నఫీజుకి. వచ్చిన వెంటనే పైకి లేచాడు. పని చేయటానికి మొరాయిస్తున్న అవయవాలను అతి ప్రయత్నం మీద స్వాధీనంలోకి తెచ్చుకున్నాడు.

"అరెరే... పారిపోతున్నాడు దొంగ రాస్కెల్... పట్టుకోండి. క్రింద పడేసి పాదాలతో మట్టగించండి...." స్ట్రెచర్ వెనుకే వస్తున్న పర్సనాలిటీ బిగ్గరగా అరిచింది.

పిడికిలి బిగించి ఆ నోటి మీద చాలా బలంగా కొట్టాడు నఫీజు. కొట్టానని అతను అనుకున్నాడు గాని, నిజానికి అది కొట్టటం అని పొరపాటుగా కూడా అనిపించుకోదు. నెట్టటం అనిపించుకుంటుంది. వెనక్కి తూలి, రెండు అడుగుల దూరంలో ఉన్న ఒక గోడను ఆసరాగా చేసుకుని, క్రింద పడిపోకుండా నిలబడింది ఆ పర్సనాలిటీ.

అయితే, ఆ దృశ్యాన్ని చూసేందుకు అక్కడే నిలబడి ఉండలేదు నఫీజు. వింటినుంచి వెలువడిన బాణం మాదిరి ముందుకు దూసుకు పోయాడు.

సిగరెట్లు గాని, బీడీలు గాని కాల్చటం, పొగపీల్చటం ఇంజూరియస్ టు హెల్త్ అని తెలిసి కూడా ఒక సిగరెట్ని వెలిగించుకుని, అవతలి డోర్ దగ్గర నిలబడి ఉన్నాడు అంబులెన్స్ డ్రయివర్.

ఇవతలి డోర్లో నుంచి స్టీరింగ్ ముందుకు చేరుకుంటున్న నఫీజును కొంచెం ఆలస్యంగా గమనించాడు.

"అర్రెరే... అర్రరే... పట్టుకోండి. పట్టుకోండి." అని అరుస్తూ ఇవతలి పక్కకు రాబోతున్న సమయంలోనే బర్రుమని కదిలింది ఆ వెహికల్. పొగలు పీలుస్తూ వేగంగా పరుగులు మొదలుపెట్టింది.

సెల్ఫోన్లలో మేసేజీలు పంపి రోడ్లను బ్లాక్ చేయంచటానికి, వైర్లెస్ సెట్లను యాక్టివేట్ చేసి సిటీనంతా ఎలర్ట్ చేయటానికి నఫీజు ఏమీ గొప్ప క్రిమినల్ ఎలిమెంట్ కాదు. రొమ్ములు విరిచి, మీసాలు మెలివేస్తూ తిరిగే గజదొంగ అంతకన్నాకాదు... ఆఫ్టరాల్ ఒక చిన్న చైన్ స్నాచర్... పోలీసులు అందరూ ఆ సంఘటనను గురించి తెలుసుకునే సరికి చాలా ఆలస్యం అయిపోయింది.

సిటికీ దక్షిణంగా ఉన్న రైల్లేస్టేషన్లో మూడో నెంబర్ ప్లాట్ఫాం మీద కదలటానికి సిద్ధంగా ఉంది ఒక సూపర్ఫాస్ట్ ట్రెయిన్. అంబులెన్స్ని స్టేషన్కి

మూడు కిలోమీటర్ల దూరంలో వదిలేసి, పడుతూ లేస్తూ వచ్చి, ఆ ట్రెయిన్‌లో సెటిల్ అయిపోయాడు నఫీజు.

"అరే... నఫీజుగాడా. వళ్ళు గుల్ల అయింది. లేచి నిలబడితే కళ్ళు పచ్చబడి గిర్రుగిర్రున తిరుగుతున్నాయని చెప్పావు. జేబులు ఖాళీ అని కూడా చెప్పావు... మరి ఆ సూపర్‌ఫాస్ట్ ట్రెయిన్లో ఎలా కూర్చున్నావ్ బే? ఇంకోసారి నడ్డి విరిగి పోయేటట్టు క్రిందికి తోసేయలేదా ఎవరూ?" నలభై ఎనిమిది గంటల తర్వాత సిటీలోకి వచ్చి తన ఎదుట నిలబడిన అతన్ని అడిగాడు విన్నుదాదా ఆశ్చర్యంగా.

"అదేదో అలా జరిగిపోయిందిలే అన్నా- ఆ రైలు గాడిలో జర్నీ కూడా పెద్ద కథ... తర్వాత ఎప్పుడయినా చెపుతా... ముందు నాకు కాస్త...." క్రింద పడిపోకుండా ఒక గోడను ఆసరాగా చేసుకుంటూ అన్నాడు నఫీజు.

అప్పటికప్పుడు వేడివేడి చాయ్ తెప్పించి ఇచ్చాడు విన్నుదాదా. పదిహేను నిమిషాల తర్వాత నాస్తా ఇప్పించాడు.

"నాతోటే ఉండు... ఇంకెప్పుడు ఆ స్టేటుకేసి పోబోకు. ఈసారి నిన్ను ఎవరూ వదిలిపెట్టరు. మట్టిలో కప్పెట్టేస్తరు...." అని కూడా చిన్న వార్నింగ్ ఇచ్చాడు.

పది కబ్జాల్లో తనేంటో అతనికి ఎర్కచేశాడు నఫీజు. ఏడు కొట్లాటల్లో అతనికి తగలాల్సిన దెబ్బల్ని తాను తగిలించుకుని, అతన్ని సేవ్ చేశాడు.

"నచ్చినవ్ బే... నాకు బల్‌బాగా నచ్చినవ్... రైటు హేండువి నువ్వు. నెలకు ఇంకో రెండు వందలు ఎక్కువ ఇస్తున్నా." అప్పటికప్పుడు ఎనౌన్స్ చేసి తన దగ్గిరే అట్టిపెట్టుకున్నాడు అతన్ని విన్నుదాదా.

అతను ఎక్కువ ఇస్తానన్నా రెండు వందలు తాను కాల్చే బీడీలకు కూడా సరిపోవని తెల్సినా, విశ్వాసంగా అతన్ని అంటి పెట్టుకునే ఉన్నాడు నఫీజు అప్పటినించీ... తన సత్తాఏంటో పూర్తిగా తెలియచెప్పే అవకాశం కోసం ఎదురు చూస్తూ ఉండగా...

ఇదిగో ఇప్పుడు ఎట్ట ఎదుట ప్రత్యక్షం అయింది అది.

సిటీ సెక్యూరిటీ కన్సల్టెంట్స్ అనేది ఒక క్రైమ్ ఇన్వెస్టిగేషన్ సంస్థ. వాత్సవ అనీ ఒక మంచి పర్సనాలిటీ రన్ చేస్తున్నాడు దానిని. విన్నుదాదా చెపుతున్న శ్యామ్‌సుందర్ ఆ సంస్థలో పార్టనర్.

శ్యామ్‌సుందర్ని వేసేయమని విన్నుదాదాకి ఎవరో సుపారీ ఇచ్చారు... ఎవరు ఇచ్చిందీ బయటికి చెప్పటంలేదు అతను...

"ప్రతిరోజు ఏదో ఒక టైములో ఆఫీసు వదిలి బయటికి వస్తాడు ఆ శ్యామ్‌సుందర్. ఎటుబోతడో, యాడికి బోతడో ఎవరికీ ఎర్క ఉండదు. నీట్‌గా ఫాలో అవ్వాలి. టైము చూసుకుని ఖతమ్ చేసేయాలి. మీరు దొర్కకూడదు. నేను దొర్కగూడదు. రెండో కంటివాడికి కూడా ఏమీ తెలియకూడదు...." తన వాళ్ళందరినీ అడ్డాలో మీటింగ్‌కి పిలిచి చాలా క్లియర్‌గా, చాలా స్పష్టంగా చెప్పాడు.

ఏది చెప్పినా, ఏం చేయమని ఆర్డర్ ఇచ్చినా గుడ్డిగా దూసుకు పోయేందుకు సిద్ధంగా ఉండటం వల్ల వెంటనే తలలు ఊపేశారు అందరూ – ఒక్క నఫీజుగాడు తప్ప.

"అన్నా– చిన్న పని పడింది. నువ్వు సరేనంటే ఇలా పోయి అలా వచ్చేస్తా...." తాము ఎటాక్ చేయవలసింది ఎవరినో తెలిసిన తర్వాత పది క్షణాలు ఆగి చిన్నగా చెప్పాడు విన్నుదాదాకి.

శ్యామ్‌సుందర్ అంటే ఎవరో తనకి సరిగ్గా తెలియనట్లు తేలికగా మాట్లాడినప్పటికీ, అతనికి తమ టార్గెట్ ఎటువంటిదో చాలా బాగా తెలుసని, నఫీజుగాడు అమాయకం నటిస్తున్నాడని అర్థం అయిపోయింది విన్నుదాదాకి.

"సర్లే నఫీజుగాడా–జల్దీబోయి జల్దీగా వచ్చేయ్... అవసరం అయితే నువ్వు నేను కూడా సీనులోకి వెళ్ళాల్సి ఉంటుంది." చిన్నగా ఒప్పుకున్నాడు. వట్టిగా ఒప్పుకోవటమే కాదు... "నడుచుకుంటూ పోమాకు. ఆటోలో బోయి ఆటోలోనే వచ్చేయ్." అంటూ మూడొందల నోట్లు అడగకుండానే జేబులో నెట్టాడు.

ఇలా పోయి అలా వచ్చేస్తానని చెప్పటం అయితే చెప్పాడు గాని, చెప్పినట్లు చేసే ఆలోచన ఏమీ లేదు నఫీజు మనసులో.

ఫేర్ ఆటో ఒకటి పట్టుకుని, సిటీ సెక్యూరిటీ కన్సల్టెంట్స్ ఆఫీసుకు అరకిలోమీటరు దూరంలో దిగిపోయాడు. లెఫ్ట్ రైటు కొట్టుకుంటూ ఆఫీసుకు ఎదురుగా ఉండే ఒక చిన్న పాన్ డబ్బీ ముందుకు చేరుకున్నాడు.

చిన్నదే ఆ డబ్బీ. ఒక మనిషి లోపల నిలబడితే, ఇంకో మనిషి ఎంటర్ అవటానికి అంగుళం కూడా సందు ఉండదు. కాని, సిటీలో సగం మందికి చాలా బాగా తెలుసు అది ఎటువంటిదో.

కాలేషావలీ నడుపుతూ ఉంటాడు ఆ డబ్బీని. కాలేషావలీ అంటే జర్దాపాన్ కట్టటంలో చాంద్‌సుల్తాన్ వంటి వీరుడు.

అతను గనుక మనసుపెట్టి పాన్ కట్టాడంటే, దాన్ని నోట బెట్టుకుని పది అడుగులు అవతలికి వేయగలిగిన మొనగాడు ఎవడూ లేడని పెద్ద పేరు.

కొత్తగా రిలీజ్ అయిన బయోస్కోపుకి జనం క్యూలో నిలబడినట్లు ఎప్పుడు చూసినా వరసలో నిలబడి ఉంటారు కస్టమర్లు.

వంచిన తల ఎత్తకుండా, తన చుట్టూ ఏం జరుగుతున్నా పట్టించు కోకుండా డబ్బీని తెరిచిన దగ్గర్నించీ మూసేసే వరకూ అలా పాన్‌ల మీద పాన్ కడుతూనే ఉంటాడు అతను.

"భాయిసాబ్... మంచిపాన్... ఒకటి కడతావా?" తన వంతు వచ్చేదాకా వెయిట్‌చేసి, చిన్నగా రిక్వెస్ట్ చేశాడు అతన్ని నఫీజు.

"మంచిపాన్ అంటే అర్థం ఏమిటి భాయీ–నువ్వు మంచి అని అడగక పోతే ఫాల్తూ పాన్ కడతానని అనుకుంటున్నావా?" తల ఎత్తకుండానే క్వశ్చన్ వేశాడు కాలేషావలీ.

"అబ్బే... అలాంటిదేమీలేదు బాయీ. మాట వరసకు అలా అనేశాను. నాకు జర్దా అంటే భయం... మీఠా అంటే చాలా ఇష్టం...." తడుముకోకుండా అన్నాడు నఫీజు.

అప్పుడు తల ఎత్తి చూశాడు కాలేషావలీ... కనులు చిట్లించి చూశాడు. పెదవులు బిగించి చూశాడు... ముక్కును గట్టిగా ఎగబీలుస్తూ చూశాడు.

"నిన్ను ఎక్కడో చూసినట్లు ఉంది బాయీ... గర్తుకు రావటం లేదు" అంటూ తల వంచుకోబోతూ, ఉన్నట్లుండి చిన్నగా నవ్వాడు.

"అరేయ్ నఫీజు గాడా... చాలా మారిపోయావురా... ముక్కు మూడొంకర్లు తిరిగి ఉంది. ఎన్నిసార్లు పడ్డాయిరా దెబ్బలు? నాలుగు సంవత్సరాలు అయింది కదూ?" ఆదరంగా అడిగాడు.

బయటికి ప్రదర్శించలేదు గాని... ఆర్ద్రమైపోయింది నఫీజు అంతరంగం. ప్రేమగా పిలిచేవాళ్ళు ఉన్నారు అతనికి. చనువుగా మాట్లాడే వాళ్ళు కూడా ఉన్నారు. కాని కాలేషావలీ కంఠంలో ప్రతిధ్వనించిన ఆప్యాయత మాత్రం ఎవరి దగ్గిరా లేదు.

"నాలుగేమిటి భాయీ... నాలుగుపైన ఇంకో మూడున్నర నెలలు... అప్పటికీ ఇప్పటికీ నువ్వు మాత్రం మారలేదు. ఎప్పటికీ మారవు అనిపిస్తోంది" చిన్నగా నవ్వుతూ అన్నాడు.

"నీ మెరమెచ్చు మాటలు వినిపించుకునే టైము నాకు లేదుగాని ఇంద... తీసుకో" మాట్లాడుతూనే తాను ప్రిపేర్ చేసిన మీఠాపాన్‌ని అతనికి అందిస్తూ అన్నాడు కాలేషావలీ.

"ఏంటి బే... పడుతూ లేస్తూ ఇటుగా వచ్చినావ్?" అని అడిగాడు ఆ తర్వత చాలా చిన్నకంఠంతో.

"చెప్తా... ముందు నీ పని పూర్తి చేసుకో...." పాన్‌ని బుగ్గన పెట్టుకుంటూ అన్నాడు నఫీజు.

కళ్ళు చిట్లించాడు కాలేషావలీ... పదిమంది కస్టమర్స్ వెయిటింగ్ వాళ్ళ వాళ్ళ పాన్‌ల కోసం... వాళ్ళను పంపించిన తర్వాత ఖాళీ అవుతుందని గ్యారెంటీ లేదు. వచ్చేవాళ్లు వస్తూనే ఉంటారు. లైనులో నిలబడుతూనే ఉంటారు.

"అరేయ్... చిన్నా... ఎక్కడరా?" బిగ్గరగా అరిచాడు అతను.

బడ్డీకి ఆవలి వైపున నిలబడి ఉన్నాడు అతని అసిస్టెంటు, గబుక్కున ఎదుటికి వచ్చాడు.

"వాడు మనోడే మంచిగనే కడ్తాడు... ఇవాల్టికి ఎడ్జస్టు అయిపోండి" అనుమానంగా చూడడం మొదలుపెట్టిన కస్టమర్స్‌కి నిదానంగా చెపుతూ, ఒక్క ఎగుర్లో బడ్డీలో నుంచి బయటకు దూకాడు కాలేషావలీ.

అతని స్థానాన్ని వెంటనే ఆక్రమించుకుని, అతని మాదిరిగానే సీరియస్‌గా పాన్‌లు కట్టడం మొదలుపెట్టాడు అతని అసిస్టెంటు.

"చెప్పుబే... రాకరాక వచ్చావు. ఏంటీ సంగతి... చాయ్‌గాని ఏదైనా తాపించాలా?" భుజం మీద చేయివేస్తూ అడిగాడు కాలేషావలీ... నఫీజుని.

"నువ్వు కట్టిన పాన్ బుగ్గన ఉండగా చాయ్ కాదుగదా... స్కాచ కూడా లోపలికి పోదు భాయీ... నీ చెయ్యే చెయ్యి...." మెచ్చుకోలుగా అన్నాడు నఫీజు.

"స్కాచుగీచు అంటున్నావ్.. ఏంది రోవ్. కథ ఏమైనా పెద్దది అయిందా??" చిటికెలో ఎలర్ట్ అయిపోయాడు కాలేషావలీ.

"నా కథకి అంత సీను లేదన్నా. శ్యామ్ సుందర్ సాబ్ సంగతేంటి?" తల తిప్పి రోడ్డుకు అవతలగా ఉన్న పెద్ద బిల్డింగ్ కేసి చూస్తూ అడిగాడు నఫీజు.

"తికమకలు వద్దుబే. డొంక తిరుగుళ్ళు మొదలే వద్దు. ఒక సారి కాదు మొత్తం మూడుసార్లు ఆ సాబ్ చేతిలో తన్నులు తిన్నావు. ఇంకా నీకు బుద్ధి రాలేదనే నాకు అనిపిస్తోంది" చురచుర చూడటానికి రెడీ అయిపోతూ సీరియస్‌గా అన్నాడు కాలేషావలీ.

"గుస్సామత్ కరోభాయీ... మాట వరసకి అడిగాను. ఆ సాబ్‌ని ఇవాల్టినుంచీ కొంచెం వెనకా ముందు చూసుకుంటూ ఉండమని చెప్పు" అన్నాడు నఫీజు.

"శ్యామ్‌సాబ్‌ని జాగ్రత్తగా ఉండమని చెప్పేటంత దాదావి అయిపోయావుబే నువ్వు?" ఈసారి కోపంగానే అడిగాడు కాలేషావలీ.

అతను అంతగా డిస్టర్బ్ అవటానికి చాలా పెద్దకారణమే ఉందని నఫీజుకి తెలుసు. ఊరు పేరు తెలియని ఆవారా మాదిరి రోడ్డు పట్టుకుని తిరుగుతున్న సమయంలో శ్యామ్‌సుందర్‌కి పరిచయం అయ్యాడు కాలేషావలీ.

ఎదుటి మనిషిలో ఎటువంటి టాలెంట్ ఉన్నా చిటికెలో పసి కట్టడం శ్యామ్‌సుందర్‌కి వెన్నతో పెట్టిన విద్య.

మాసిపోయిన దుస్తులతో, అరిగిపోయిన స్లిప్పర్స్‌తో, దిగులుతో నీరసించిపోయి ఉన్న కాలేషావలిని ఒక థియేటర్ దగ్గర చూశాడు అతను.

చేతులు జాచి దీనంగా యాచన మొదలుపెట్టేందుకు నిలుచున్నాడని మొదట్లో అనుకున్నాడు. థియేటర్ దగ్గర ఉన్న పాన్ డబ్బా వంకే పరిశీలనగా చూస్తుంటే... అక్కడ ఉన్న వారిలో ఎవరి జేబో కత్తిరించే ఆలోచన చేస్తున్నాడని కూడా అనుకున్నది నిజం.

"ఏమిటీ ఆలస్యం? ఎవరినైనా ఎక్స్‌పెక్ట్ చేస్తున్నావా?" అని శ్యామ్‌ని అడిగాడు అతనితోపాటు వచ్చిన ఇన్స్‌పెక్టర్ రమేష్.

తన ఆలోచనలు గనుక అతనికి తెలిస్తే... తాను అబ్జర్వ్ చేస్తున్న మనిషికి రోజులు మూడిపోయినట్లేనని శ్యామ్‌సుందర్‌కి తెలుసు. చటుక్కున పోయిపట్టేసు కుంటాడు అతన్ని. రెండు... రెండంటే రెండు చెంపదెబ్బల్తో దిమ్మ తిరిగి పోయేటట్లు చేస్తాడు.

వట్టొట్టి అనుమానాలతో ఒక నిండు ప్రాణాన్ని అటువంటి కఠిన శిక్షలకు గురి చేయటం భావ్యం అనిపించుకోదు.

"నువ్వువెళ్ళి లోపల కూర్చో... నేను నాలుగు నిమిషాల్లో వచ్చేస్తాను" తన మనసులో ఏముందో, బయటికి కనిపించకుండా జాగ్రత్త పడుతూ చెప్పాడతడు..

"నువ్వు ఎప్పుడు ఏం చేస్తావో, ఏం మాట్లాడతావో తెలుసుకోవటం ఇంపాజిబుల్. సినిమాకి రమ్మన్నదీ నువ్వే... కాస్సేపు ఆగమనేది కూడా నువ్వే. మెంటల్ మేళానివి" సున్నితంగా వెక్కిరిస్తూ థియేటర్ ఆవరణలోకి నడిచాడు రమేష్.

పాన్‌డబ్బా ముందున్న పర్సనాలిటీ మీదనే తన దృష్టిని కేంద్రీకరించి ఉంచాడు శ్యామ్‌సుందర్.

ఉన్నట్లుండి కదిలాడు ఆ మనిషి. రెండే రెండు అంగల్లో ఆ డబ్బా ముందున్న వ్యక్తుల్ని సమీపించాడు.

నలుగురు ఉన్నారు వాళ్ళు. అందరికంటే ఆఖర్లో ఉన్న మనిషి అర్జంటు పనేదో ఉన్నట్లు, వేగంగా వెనక్కి తిరిగి అవతలకి బయలుదేర బోతున్నాడు.

అతని చేతిని గట్టిగా పట్టుకున్నాడు శ్యామ్‌సుందర్ అబ్జర్వ్ చేస్తున్న వ్యక్తి.... "దొంగ... పర్సు దొంగిలించాడు... దొంగ... "బిగ్గరగా అరిచాడు.

అదిరిపడి తమ జేబుల్ని తడుముకున్నారు మిగిలినవారు. విపరీతమైన కోపం కంగారు తనను ఆవరించుకుంటూ ఉండగా ముందుకు వచ్చాడు వారిలో ఒకతను.

చిటికెలో పోగుపడింది పెద్దగుంపు. తమకు సంబంధం లేకపోయినా తలా ఒక దెబ్బవేశారు అందరూ. పర్సును దొంగిలించబోయిన మనిషి అచేతనంగా క్రింద పడిపోయే సరికి, మంత్రం వేసినట్లు మాయమైపోయారు ఆ ప్రదేశంలోనుంచి.

"దొంగను గుర్తించింది నువ్వు... పట్టించి ఇచ్చింది కూడా నువ్వే... పోలీసులు వచ్చి నీ అవతారం చూస్తే చాలా ఇబ్బంది అని తెలియదా నీకు?" అడిగాడు శ్యామ్‌సుందర్.

నీరసంగానే కనిపిస్తున్నా చక్కగానే నవ్వాడు ఆ వ్యక్తి. "పోలీసులు ఏదో చేస్తారని చెప్పి, అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకోవడం పద్ధతి కాదు గదా...." అన్నాడు.

మహబాగా నచ్చేసింది ఆ మాట శ్యామ్‌సుందర్‌కి. అప్రయత్నంగా తన వాలెట్‌ని బయటికి తీశాడు.

"పైసలు వద్దు సాబ్... పని ఏదయినా ఉంటే ఇప్పించండి...." తడుము కోకుండా నిర్మొహమాటంగా అడిగాడు ఆ వ్యక్తి.

"ఏం చేస్తావ్, నువ్వు?" వినోదంగా చూస్తూ అడిగాడు శ్యామ్‌సుందర్.

"పాన్ డబ్బాలో పని చేయగలను సాబ్. నాగపూర్లో పాన్‌లు కట్టటం నేర్చుకున్నాను. నా పేరు కాలేషావలీ" చెప్పాడు అతను.

వినయంగా నిలబడి ఉన్న పాన్‌డబ్బా ఓనర్‌ని ఇవతలకి రమ్మని చెప్పి, కాలేషావలిని లోపలికి పంపించాడు శ్యామ్‌సుందర్.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Dare+Devil+1**

* * *